ప్రెస్‌క్లబ్ కార్యాలయం ప్రారంభం

మేడ్చల్‌రూరల్: ఉమ్మడి శామీర్‌పేట్ మండల ప్రింట్ మీడియా నూతన ప్రెస్‌క్లబ్ కార్యాలయాన్ని బుధవారం జిల్లా టీయూడబ్ల్యూ అధ్యక్షులు బాలరాజ్ ప్రారంభించారు. ఉమ్మడి శామీర్‌పేట్ మండల ప్రింట్ మీడియా నూతన అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో తూంకుంట మున్సిపాలిటీ పరిధి శామీర్‌పేట్‌లో నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియా ప్రభావం ఎంత ఉన్నా పత్రికల విలువ ఎన్నటికీ తగ్గదన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, శామీర్‌పేట్, జీనోమ్‌వ్యాలీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనాథ్, వెంకట్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

కీసర: కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాలిటీ కుందన్‌పల్లి రామలింగేశ్వర కాలనీలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడంతో బుధవారం ఎంఈవో జమదగ్ని ఆధ్వర్యంలో స్థల పరిశీలన చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచే పాఠశాలను ప్రారంభించేలా స్థానిక కమ్యూనిటీ హాల్ కేంద్రాన్ని పరిశీలించారు. కీసర స్కూల్ హెచ్‌ఎం రవిచంద్రశేఖర్, సీఆర్‌పీలు రజనీ, మహేష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇంజినీరింగ్ కాలేజ్' అవార్డు



అవార్డు అందుకుంటున్న కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహ్మారెడ్డి కళాశాలకు బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇంజినీరింగ్ కాలేజ్ అవార్డు దక్కింది. విద్యారంగంలో ప్రతిష్టాత్మకంగా భావించే కెరియర్ 360 సంస్థ నిర్వహించిన జాతీయస్థాయి సమీక్షలో భాగంగా నర్సింహ్మారెడ్డి కళాశాలకు అవార్డు వరించింది. ఈ మేరకు సంస్థ సీఈఓ, అసోసియేట్ పబ్లిషర్ ధీరజ్‌శర్మ కళాశాల సెక్రటరీ త్రిశూల్‌రెడ్డికి అవార్డును అందజేశారు. కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపాల్ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల రిమాండ్



ఘట్‌కేసర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులకు ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌కు చెందిన బుర్ర గౌతమ్ (23), డెలివరీ బాయ్ అన్నబోయిన కిరణ్‌కుమార్ (29) అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. పట్టణంలోని లింగాలకుంటలో అదుపులోకి తీసుకున్నారు. వారి చేతిలో ఉన్న సంచీని తనిఖీ చేయగా.. 330 గ్రాముల గంజాయి బయటపడింది. గంజాయిని స్వాధీనం చేసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించారు.

రూ.14.50 కోట్లతో మార్కెట్ యార్డు అభివృద్ధి

మేడ్చల్: మేడ్చల్ మార్కెట్ కమిటీ పరిధిలో రూ.14.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్ అన్నారు. మేడ్చల్‌లోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం పాలకవర్గం సమావేశం నిర్వహించారు. కమిటీ సమావేశంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రైతులకు అందిస్తున్న సేవలను చైర్మన్ వివరించారు. మార్కెట్‌యార్డు ఆవరణలో 5వేల మెట్రిక్ టన్నుల 2 గోదామ్‌లు, సీసీరోడ్ల నిర్మాణం, స్వాగత కమాన్, ఇతర పనులు చేయాలని ప్రతిపాదించి తీర్మానాలు చేశారు. ఆమోదం కోసం నాబార్డుకు పంపినట్లు తెలిపారు. కార్యదర్శి శ్రీనివాస్, డైరెక్టర్లు రేగు రాజు, దుర్గం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌ఫిల్మ్ వాడితే చట్టపరమైన చర్యలు



జవహర్‌నగర్: వాహనాలకు బ్లాక్‌ఫిల్మ్ వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జవహర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ అన్నారు. బుధవారం సాకేత్ సమీపంలో సిబ్బందితో కలిసి ఆయన బ్లాక్ ఫిల్మ్ ఉపయోగిస్తున్న వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. అనంతరం బ్లాక్ ఫిల్మ్ వాడిన వాహనాలపై జరిమానా విధించారు.

ఆస్తిపన్ను మదింపులో అక్రమాలు !

- భవన విస్తీర్ణం కొలతల్లో తేడాలు
- నగర శివారుల్లో 34 పురపాలికలు
- ఏళ్ల తరబడి సిబ్బంది జాప్యం చేస్తున్నారని ఆరోపణలు
- ఇంటి నంబర్లపై ప్రత్యేక చర్యలకు యంత్రాంగం కసరత్తు



సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు పురపాలక సంఘాల పరిధిలో ఏళ్లుగా ఆస్తిపన్ను ఆదాయానికి గండి పడుతోంది. దీంతో ఆదాయం లేక పురపాలికల నిర్వహణ భారంగా మారుతోంది.

కేటాయించని ఇంటి నంబర్లు..

పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, వందలాది ప్రైవేట్ భవనాలు, అపార్టుమెంట్లు, వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, హాస్టళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు తదితర వాటికి ఏళ్ల తరబడి ఇంటి నెంబర్లు కేటాయించకపోవడంతో ఆస్తిపన్నుకు భారీగా గండి పడుతుందని ఆ శాఖ అధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదికలు అందించడం గమనార్హం.

ఖజానాకు జమకాని నిధులు..

ఈ పరిణామం పురపాలికలు, పంచాయతీల్లో రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది పనితీరుకు అద్దం పడుతోంది. లక్ష్యాలకు అనుగుణంగా పన్నుల వసూళ్లలో అలసత్వం వహిస్తుండటంతో కూడా ఖజానాలో నిధులు జమకావడం లేదు.

మదింపులో అక్రమాలు..

నగర శివారుల్లో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 27 మున్సిపాలిటీలు, మొత్తంగా 34 పురపాలక సంఘాలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలు ఉండగా.. రంగారెడ్డి జిల్లా పరిధిలో 3 మున్సిపల్ కార్పొరేషన్లు, 15 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో దాదాపు 2, 3 పురపాలక సంఘాలు మినహా మిగతా వాటిల్లో ఆస్తిపన్ను మదింపులో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి.

మదింపుల్లో తేడాలు..

బోడుప్పల్,జవహర్‌నగర్,బడంగ్‌పేట,మీర్‌పేట,నిజాంపేట్, ఘట్కేసర్, నాగారం, పోచారం, దమ్మాయిగూడ, కొంపెల్లి, మేడ్చల్, తూముకుంట, ఎల్లంపేట్, అలియాబాద్, మూడుచింతలపల్లి తదితర పురపాలక సంఘాలతో పాటు రంగారెడ్డి జిల్లాలోని పలు పురపాలక సంఘాల్లో కూడా ఆస్తిపన్ను మదింపుల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పన్నుల మదింపు, ఇంటి నంబర్ల కేటాయింపుల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

నిబంధనలు బేఖాతరు..

భవనాల యజమానులతో పలువురు ఉద్యోగులు కుమ్మక్కై చేతివాటంతో నిబంధనలు బేఖాతరు చేస్తూ.. తక్కువ ఆస్తిపన్ను మదింపు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాణిజ్య భవనాలను నివాసభవనాలుగా, అనుమతులు లేని వాటికి, అదనపు అంతస్తులకు పన్ను మదించకుండా, కొద్దిపాటిగా విధిస్తున్నట్లు కొందరు చెబుతున్నారు.

భవనాల విస్తీర్ణంలో తేడాలు..

విద్యాసంస్థలు ప్రస్తుతం చెల్లిస్తున్న ఆస్తిపన్ను, భవనాల విస్తీర్ణంపై ఉన్న తేడాలను పరిశీలిస్తే.. పన్ను ఎగవేస్తున్న విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో పురపాలక సంఘాలు, గ్రామపంచాయతీల్లో అనుమానం ఉన్న భవనాల కొలతలు తీయాలని నిర్ణయించినట్లు సమాచారం.

◆ నగర శివారుల్లోని పలు పురపాలికల్లో భవనాలతో పాటు అపార్ట్‌మెంట్లలోని ఇంటిపన్ను మదించని వాటిని సిబ్బంది గుర్తించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా పురపాలిక సంఘాలు ,గ్రామ పంచాయతీల ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

ఆస్తిపన్ను తక్కువగా...

ఆస్తిపన్ను తక్కువగా మదించారన్న అనుమానం ఉన్న భవన నిర్మాణాలకు తిరిగి కొలతలు తీసి నిబంధనల మేరకు పన్ను విధించేలా చర్యలకు ఉపక్రమించాలని పురపాలక అధికారులు ప్రణాళిక చేస్తున్నారు. వీటిపై ఏళ్లుగా దృష్టి పెట్టకపోవడంతో గణనీయంగా ఆదాయం కోల్పోతున్నామనే విషయాన్ని వారు గ్రహించినట్లు సమాచారం.

◆ దశలవారీగా భవనాల ఆస్తిపన్నును సవరించాలని భావిస్తున్నారు. గత వ్యత్యాసాలను గుర్తించిన పన్నును ఈ ఆర్థిక సంవత్సరం నుంచి వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో భవనాలకు తీసిన కొలతలు, మదించిన పన్నుపై అనుమానం ఉన్న పక్షంలో యాజమానులు పురపాలక సంఘాల దృష్టికి తీసుకురావాలని కోరుతున్నారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

శామీర్‌పేట్: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం అందిస్తున్న వసతులను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా చూడటం అధికారుల బాధ్యత అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా అన్నారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని మహాత్మాజ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు భోజనం సదుపాయాల వివరాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల ప్రాంగణం శుభ్రంగా ఉండేలా చూడాలని, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

ఇందిరా శక్తితో మహిళా సంఘాలు బలోపేతం..

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఇందిరా మహిళా శక్తి పథకంతో స్వయం సహాయక సంఘాలు మరింత బలోపేతమవుతాయని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. మహిళా శక్తి పథకంతో పాటు ప్రభుత్వ అభివద్ధి, సంక్షేమ పథకాలను ఇందిరా మహిళాశక్తి సంబరాల్లో భాగంగా కళాకారులు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ ప్రాంగణంలో డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి ఆమె ఇందిరా మహిళా శక్తి సంబరాలను జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలో 11 వరకు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులచే ఇందిరా మహిళా శక్తితో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు డీఆర్‌డీఏ సాంబశివరావు తెలిపారు. ఏఓ రామ్మోహన్, కలెక్టరేట్ ఉద్యోగులు, టీఎస్‌ఎస్ కళాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: కేంద్ర కార్మిక సంఘాలు, ఇండిపెండెంట్ ఫెడరేషన్లు ఇచ్చిన సమ్మె పిలుపులో భాగంగా బుధవారం జాయింట్ ఫోరమ్ ఆఫ్ ఫైనాన్స్ సెక్టార్ ఇన్ తెలంగాణ అండ్ ఏపీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎస్‌బీఐ డివిజనల్ కార్యాలయంలో ర్యాలీ నిర్వహించారు. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల నుంచి 600 మంది ఉద్యోగులు, కార్మికులు ర్యాలీలో పాల్గొన్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఎస్ వీరయ్య, బోస్ , ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా , అఖిలభారత గ్రామీణ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డిలు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలను బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26 వేలు ప్రకటించాలన్నారు. వివిధ సంఘాల నాయకులు ఎస్.రాంబాబు, రవీంద్రనాథ్, ఫణికుమార్, రవికాంత్, సతీష్, గంగాధర్, మద్దిలేటి, వీరగోని రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం.. మానసిక ప్రశాంతత



మేడ్చల్ : క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేట్ బషీరాబాద్ ఎస్సై ప్రవీణ్ అన్నారు. బుధవారం ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి నూతన్‌కల్ గ్రామంలోని జేఎస్‌ఆర్ గ్రౌండ్స్‌లో గుండ్లపోచంపల్లి టీ20 పేరుతో నిర్వహించిన క్రికెట్ టోర్నీని ఎస్సై ప్రారంభించారు. మొదటి మ్యాచ్ మేడ్చల్ ప్రెస్‌క్లబ్ టీమ్–పేట్ బషీరాబాద్ పోలీస్ టీమ్‌ల మధ్య జరగ్గా.. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రెస్ క్లబ్ టీమ్ కెప్టెన్ లక్ష్మణ్‌యాదవ్ సారథ్యంలో నిర్ణీత 16 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. పోలీస్ టీమ్ 16 ఓవర్లకు 127 పరుగులు చేయడంతో పోలీస్ టీమ్‌పై ప్రెస్ క్లబ్ టీం 11 పరుగుల తేడాతో గెలుపొందింది.

రైతులకు యూరియా సరఫరా చేయాలి



సాక్షి,మేడ్చల్ జిల్లా : జిల్లాలోని రైతులందరికీ యూరియా, డీఏపీ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత ఎరువుల డీలర్లను జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ ఆదేశించారు. ఎఫ్‌సీఓ 1985లో భాగంగా ప్రతి వ్యాపారి(డీలర్) తాను చేసే వ్యాపారం ప్రతిరోజు వ్యవసాయ అధికారికి తెలపాలన్నారు. బుధవారం నగరంలోని మూసాపేట్‌లో నిర్వహించిన ఎరువుల డీలర్లు, సేల్స్ ఆఫీసర్లు, వివిధ కంపెనీల యాజమానులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఫర్టిలైజర్ ధర పట్టిక ప్రతిరోజూ వెల్లడించాలని సూచించారు. ఎక్కువ ధరలకు ఎరువులు, క్రిమిసంహారక మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫర్టిలైజర్ కంపెనీల యాజమానులు, హోల్‌సేల్ డీలర్లు, మండల వ్యవసాయ అధికారులు స్పిక్, ఎన్ఎఫ్ఎల్, సీఐఎల్, ఐపీఎల్, ఎన్‌బీసీఎల్, క్రిబ్‌కో సేల్స్ ఆఫీసర్లు, ట్రేడింగ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

లోకాయుక్తలో పోచారం కమిషనర్‌పై ఫిర్యాదు

పోచారం: అక్రమ నిర్మాణాలపై పోచారం మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవడం లేదని లోకాయుక్తలో చౌదరిగూడకు చెందిన వినోద్‌కుమార్ 2025 ఏప్రిల్ 7న ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా బుధవారం వినోద్‌తో పాటు పోచారం మున్సిపల్ సిబ్బంది, సీడీఎంఏ ఉద్యోగులు లోకాయుక్తలో హాజరయ్యారు. అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే పూర్తి వివరాలను సమర్పించాలని లోకాయుక్త కోరినట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

శామీర్‌పేట్: గుర్తు తెలియని ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అలియాబాద్ మున్సిపాలిటీ, మజీద్‌పూర్ బస్ స్టాప్ సమీపంలో ఓ వ్యక్తి మృతచెంది ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించగా.. అతడు చుట్టుపక్కల ప్రాంతాల్లో బిక్షాటన చేసే వాడని, సుమారు 70 ఏళ్ల ఉంటాయని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాల తెలిస్తే శామీర్‌పేట పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

'పేదలకు గూడు కల్పించడమే కాంగ్రెస్ లక్ష్యం'

కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్



అవుషాపూర్‌లో భూమిపూజ చేస్తున్న వజ్రేష్‌యాదవ్

ఘట్‌కేసర్: నిరుపేదలకు గూడు ఏర్పాటు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. అవుషాపూర్, అంకుషాపూర్, మాదారంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, బీ– బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌తో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని తెలిపారు. స్థలం లేని వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తుందని స్పష్టం చేశారు. మచ్చేందర్‌రెడ్డి, యాదగిరియాదవ్, సీనియర్ నాయకుడు మాధవరెడ్డి, వామన్‌రెడ్డి, ముత్యాలుయాదవ్, ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, జంగయ్యముదిరాజ్, సందీప్‌రెడ్డి, జంగయ్యయాదవ్, లింగంగౌడ్, ఆంజనేయులుయాదవ్, సాయిలు, ఖయూమ్, రాజరత్నం పాల్గొన్నారు.

భద్రాచలం ఆలయ ఈవోపై దాడికి నిరసన



కీసరగుట్ట ఆలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆలయ సిబ్బంది

కీసర: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి రమాదేవిపై పలువురు దాడి చేయడం పట్ల బుధవారం కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భద్రాచల దేవాలయ భూములను హైకోర్టు తీర్పుతో స్వాధీనం చేసుకోవడానికి వెళ్లిన ఆలయ ఈవో రమాదేవి, సిబ్బందిపై పలువురు కబ్జాదారులు దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. దాడిచేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలయ వేద పండితులు మార్తి సత్యనారాయణశర్మ, ప్రధాన అర్చకులు బలరామశర్మ, ఉప ప్రధాన అర్చకులు రవికుమార్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవం



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ చార్టెడ్ లయన్స్ క్లబ్ కమిటీని ఘట్‌కేసర్‌లో మేడిపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నాథంగౌడ్, ఎన్నికల అధికారులు కష్టప్రసాద్, అశోక్ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లయన్ శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా రేసు లక్ష్మారెడ్డి, హిమబిందు, ప్రధాన కార్యదర్శిగా ప్రమోద్‌గుప్తా, కోశాధికారిగా కష్టప్రసాద్‌ను ఎన్నుకున్నారు. బాలరాజుగౌడ్, శారదగౌడ్, లావణ్య, మహేందర్‌రెడ్డి, లక్ష్మి, మాధవి, జగదీష్, హరినాథ్, కిరణ్, నర్సింగ్‌రావు, రవిశంకర్, జంగయ్య పాల్గొన్నారు.

మేడ్చల్ డిపోలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

మేడ్చల్: ప్రయాణికులకు రక్షిత తాగునీరు అందించాలనే ఉద్దేశంతో మేడ్చల్ ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఆర్టీసీ అధికారులు మంగళవారం ప్రారంభించారు. సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ వల్ల మేడ్చల్ నుంచి ప్రయాణించే ప్రయాణికులకు తాగునీటి సమస్య తీరనుంది. ప్లాంట్‌ను డీఎం సుధాకర్, డిప్యూటీ ఇంజనీర్ విష్ణుమూర్తిలు ప్రారంభించారు. డిపో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ యంనంపేట్ ఫీడర్ పరిధిలో యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో ఉదయం 10.00 నుంచి ఒంటి గంట వరకు, ఎన్ఎఫ్‌సీనగర్ ఫీడర్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఘట్‌కేసర్ ఏఈ యశ్వంతకుమార్ తెలిపారు. జవహర్‌నగర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబశివరావు తెలిపారు. బాలాజీనగర్ సబ్‌స్టేషన్ 11కేవీ సాయిబాబా ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాలాజీనగర్ ప్రధాన రహదారి, వీఆర్‌వో ఆఫీస్, మోహన్‌రావు కాలనీ, వేంకటేశ్వరకాలనీ, సిల్వర్‌సీ గల్లీ, మార్కెట్ రోడ్డు, సాయిబాబా టెంపుల్ కమాన్ రోడ్డు తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగిస్తున్నందున గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కండ్లకోయ, రైల్వేట్రాక్‌రోడ్డు, సుతారిగూడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు.

కార్మికుల హక్కులను కాపాడుకోవాలి

సార్వత్రిక సమ్మె విజయవంతమైందన్న కార్మిక సంఘాలు



ఘట్‌కేసర్‌లో..

కీసర: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ నాయకులు బంగారు నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కాపాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలన్నారు. వినోద, నాయకులు శివనారాయణ, బాలు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాములు, కృష్ణ, రవి, కృష్ణ, మల్లేష్, బాలమ్మ, బాలేష్, లింగమణి, కిష్టమ్మ, రాములయ్య, లక్ష్మి, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్: దేశవ్యాప్త సమ్మె సందర్భంగా జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు వద్ద పనిచేస్తున్న బీఆర్‌టీయూ కార్మికులు సమ్మెను విజయవంతం చేశారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను, లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. నాగయ్య, శ్రీనివాస్, నర్సింహరెడ్డి, మల్లికార్జున్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీయూలో చేరికలు...

జవహర్‌నగర్ డంపింగ్‌యార్డులో పనిచేస్తున్న కేవీఆర్ కార్మికులు బుధవారం బీఆర్‌టీయూ యూనియన్‌లో చేరారు. సురేష్, హరినాథ్, రాజ్‌కుమార్, శ్రీహరి, నాగరాజు, ఇమ్రాన్, ఆంజనేయులు, కృష్ణ, కురుమన్న, ఆంజనేయులు, చంద్రశేఖర్, 50 మంది కార్మికులు బీఆర్‌టీయూలో చేరారు.

ఘట్‌కేసర్: ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధర్యంలో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం రైల్వే స్టేషన్ సమీపంలో బహిరంగ సభను నిర్వహించారు. మధ్యాహ్నభోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు రూ.26 వేలు కనీసవేతనం చెల్లించాలని, అంగన్‌వాడీ టీచర్స్ పనిభారం తగ్గించాలని, 282 ప్రభుత్వ ఉత్తర్వును రద్దు చేయాలని నినాదాలు చేశారు. సీపీఎం నాయకుడు యాదయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు జయచంద్ర, సీపీఎం మండల కార్యదర్శి సబిత, సీపీఐ మండల కార్యదర్శి ఈశ్వర్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సృజన, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి, అశోక్, రామచందర్, అంగన్‌వాడీ రాష్ట్ర అధ్యక్షురాలు పేరిజాన్, జిల్లా అధ్యక్షుడు సుచిత్ర, లక్ష్మి, శ్రీనివాస్, పుష్ప, భాస్కర్, చంద్రమోహన్, నాగమణి, చంద్రశేఖర్, మల్లేష్, ముత్తమ్మ, వేణుమాధవ్ పాల్గొన్నారు.

మేడ్చల్: కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లను మార్చడాన్ని వ్యతిరేకిస్తూ.. కార్మిక సంఘాలు మంగళవారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె మేడ్చల్ లో విజయవంతమైంది. సీఐటీయూ, బీఆర్‌టీయూ తదితర సంఘాల నాయకులు సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేశారు. రెండు సంఘాల నేతలు మేడ్చల్‌లో వేర్వేరుగా కార్మికులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో కార్మిక నాయకులు పర్యటించి పరిశ్రమలను మూసివేయించారు. కార్మిక నాయకులు అశోక్, ప్రభాకర్, నరేష్ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు వద్ద బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో..



దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం వద్ద..



మేడ్చల్ సీఐటీయూ ఆధ్వర్యంలో..